ప్రజాశక్తి

గురువారం 25 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

లెక్కలేనితనం

- కలెక్టర్ ఆదేశాలను పెడచెవిన పెట్టిన ర్యాంకీ
- పెద్ద చెరువులో విడిచిపెట్టిన వ్యర్థ రసాయనాలు
- చనిపోయిన చేపలు
- దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

చెరువులో చనిపోయిన చేపలను తొలగిస్తున్న ర్యాంకీ సిబ్బంది

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

పరవాడ ప్రజలను ర్యాంకీ నిద్రపట్టనీయడంలేదు. ఫార్మా డెవలపర్‌గా ఉన్న ర్యాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థాలను శుద్ధి చేయకుండా విడిచిపెట్టడం, రసాయన వాసనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కనీస ఉపశమనం కల్గించే చర్యలు ప్రభుత్వ యంత్రాంగం తీసుకోలేకపోవడంతో రోజూ పరిసర ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించని ర్యాంకీపై చర్యకు ప్రభుత్వాలే జంకడంతో అధికార యంత్రాంగం అచేతన స్థితిలో చేతులు కట్టుకొని కాలం నెట్టుకొస్తోంది. ర్యాంకీ తప్పిదాలను విచారణ పేరుతో తప్పించడం కనబడుతుంది తప్పితే చర్య తీసుకొనే సాహసం చేయడంలేదు. పరవాడ మండలం పెదముషిడివాడ బచ్చులబందలో రసాయన డ్రమ్ములు, వ్యర్థాలు విడిచిపెట్టిన ఘటన మరువకముందే, పరవాడ-భరిణికం మధ్యన మొల్లోడు గెడ్డలోకి ఫార్మా వ్యర్థ రసాయనాలు శుద్ధి చేయకుండా ర్యాంకీ వదలడం వివాదస్పదమైంది. రసాయన వాసనలు భరించలేక భరిణికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు సహా కొందరు గ్రామస్తులు కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఈ నెల 15న ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్... గెడ్డలో ఫార్మా వ్యర్థ రసాయన నీటిని పూర్తిగా తోడించి, ర్యాంకీ రసాయన శుద్ధి యూనిట్‌కు తరలించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. దీనిపై ర్యాంకీ కొంతనీటిని తోడించి, మిగిలిన రసాయప నీటిని ఇటీవల కురిసిన వర్షాలకు గెడ్డలో విడిచిపెట్టింది. చేనులో మేయడానికి అలవాటుపడ్డ గొడ్డు గట్టున మేయదన్నట్లు, వ్యర్థాలను శుద్ధిచేయకుండా బయటకు విడిచిపెట్టడం అలవాటుపడ్డ ర్యాంకీ ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థ రసాయనాలు గెడ్డలో వదలడంతో పెద్ద చెరువు నీరు కలుషితమైంది. దీంతో పరవాడ పెద్ద చెరువులోని చేపలు చనిపోయి ఒడ్డుకు చేరాయి.

పెద్ద చెరువులో లక్షలు విలువైన చేపలు సోమ, మంగళవారాల్లో గిలగిల కొట్టుకుంటూ చనిపోయినా ర్యాంకీ యాజమాన్యానికి చీమ కుట్టినట్లయినా లేదు. బహిరంగ ప్రదేశాలు, చెరువులు, గెడ్డల్లోకి రసాయన వ్యర్థాలు విడిచిపెట్టకూడదన్న నిబంధనలు పాటించని ర్యాంకీ యాజమాన్యంపై కఠినమైన చర్యలేవీ తీసుకోకపోవడంతో ర్యాంకీకి ఇదొక దినచర్యగా మారిపోయింది. ఫార్మా కంపెనీల వ్యర్థ రసాయనాలను శుద్ధిచేయాల్సిన ర్యాంకీ వాటిని వర్షాలు సమయంలో శుద్ధి చేయకుండా గెడ్డల్లో విడిచిపెడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ర్యాంకీ వ్యర్థాలతో పెద్ద చెరువు కింద వంద ఎకరాల ఆయకట్టు సాగుకు పనిరాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువు కింద యేటా రైతులు వరి పండించేవారు. రసాయనాలు చెరువులోకి విడిచిపెట్టడంతో వరి పంట దిగుబడులు తగ్గిపోయినట్లు రైతులు చెబుతున్నారు. చెరువు నీరు సాగుకు అనువుగా లేకపోవడంతో పంటలు వేసినా పెట్టుబడులకు కూడా రావడంలేదని వాపోతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖపట్టణం : విశాఖ జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రయవేటు సంస్థల్లో స్వచ్ఛంద పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఫ్రైడే డ్రై డే తప్పకుండా పాటించాలని ఆదేశించారు. క్లీన్ విశాఖ, క్లీన్ అవర్ ఆర్గనైజేషన్ మోటోతో అందరూ పనిచేయాలని నిర్దేశించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో బుధవారం జివిఎంసి కమిషనర్‌తో కలిసి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించాల్సిన పద్ధతులు, అవలంభించాల్సిన విధానాలపై కలెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు.

కేవలం ఒక్క వైద్యారోగ్య, మలేరియా విభాగంతోనే ప్రజల ఆరోగ్య పరిరక్షణ సాధ్యం కాదని, అన్ని విభాగాల అధికారులు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, కార్పొరేట్ సంస్థల పరిశరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి గంబూషియా చేపలను విడిచిపెట్టాలన్నారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రయివేటు ఆసుపత్రులపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వసతి గృహాల్లో, ఆసుపత్రుల్లో దోమ తెరలను, మెస్‌లను వినియోగించాలని సూచించారు. ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. పట్టణ మురికి వాడలపై దృష్టి సారించి ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్ చల్లాలని, సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. ఏ రోజు తాగునీరు ఆ రోజే సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని జివిఎంసి కమిషనర్‌కు సూచించారు.

జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ, పట్టణంలోని ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ పారిశుధ్య చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలు కూడా బాధ్యతగా మెలగాలని, ఎక్కడబడితే అక్కడ చెత్త వేయరాదని, ముఖ్యంగా కాలువల్లో చెత్త వేయరాదని హితవు పలికారు. జ్వర కేసులు నమోదైతే ఆ చుట్టు పక్కల ప్రాంతంలో శానిటైజ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావు, జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి, కెజిహెచ్ సూపరింటెండెంట్ కె.శివానంద, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల్లో మురుగునీరుపై చర్యలు చేపట్టాలి

▶ వార్త 8లో..

మార్చి నాటికి 10 వేల మందికి ఉపాధి : కలెక్టర్

▶ వార్త 8లో..

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి

▶ వార్త 2లో..

వినూత్న ఆలోచనలతో ప్రపంచ సవాళ్లకు పరిష్కారం

▶ వార్త 8లో..

కశింకోటలో నీట మునిగిన ఆకు మడులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

825 ఎకరాల్లో ఆకుమడులు నీట మునక

350 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు 825 ఎకరాల్లో వరి ఆకు మడులు నీటమునిగాయి. వర్షపు నీటికితోడు గెడ్డ, వాగులు పారడంతో ఆకు మడుల్లో నీరు చేరింది. గత నాలుగు రోజుల జిల్లా సగటు వర్షపాతం 257 మిల్లీమీటర్లకు 408 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడంతో ఆకుమడులు మునిగిపోయాయి. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం జిల్లాలో 825 ఎకరాల్లో ఆకు మడులు నీళ్లపాలైనట్లు గుర్తించారు. ఆకులు పోసిన పది, పదిహేను రోజుల్లో అధిక వర్షాలు పడ్డంతో

మిగతా 2లో..

కార్పొరేటీకరణతో సపోర్టు ఉంటుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పోర్టు వర్కర్ల ఆందోళన బాట పట్టారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోర్టు స్థలాలు, ఆసుపత్రులు, ఓడరేవుల్లోని బెర్తులను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే చర్యలకు వ్యతిరేకంగా వైజాగ్ పోర్టు ఎదురుగా ధర్నాకు పోర్టు వర్కర్లు, ఉద్యోగులు పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా మేజర్ పోర్టుల్లోని ఆస్తుల అమ్మకంపై పోర్టు డాక్ వర్కర్స్ 25, 26 తేదీల్లో ప్రైవేటీకరణపై సమ్మెకు ఇదివరకే పిలుపునిచ్చాయి. విశాఖ పోర్టుకు సంబంధించి శాలిగ్రాంపురంలోని రూ.500కోట్ల విలువైన 17 ఎకరాలను రూ.125 కోట్లకు ఇనార్బిట్ మాల్‌కు ఇచ్చేయడంతో పోర్టుకు చెందిన ట్రేడర్లంతా అవాక్కయ్యారు. ఈ ఒప్పందంలో లాలూచీ ఉందని ఇప్పటికీ పోర్టు వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ తరహా వ్యవహారాలను నేరుగా కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కారే పర్యవేక్షణ జరుపుతూ యాజమాన్యానికి దిశానిర్దేశం చేయడంతో పోర్టు ఆసుపత్రిని కూడా అమ్మేయాలని చూశారు. ప్రజా నిరసనతో వెనక్కి తగ్గారు. అయినా సరే రూ.261 కోట్లతో పిపిపి చేయాలని పోర్టు కేంద్రానికి ప్రతిపాదన చేసింది. పర్మినెంట్ పోస్టులను యాజమాన్యం మరోవైపు భర్తీ చేయకుండా ఎగనామం పెడుతోంది. పనిచేస్తున్న పలువురు కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితి కొనసాగుతుందని పోర్టు డాక్ అండ్ వర్కర్స్ నాయకులు ఆవేదన చెందుతున్నారు. గురువారం ఉదయం పోర్టు సీ హార్స్ జంక్షన్ వద్ద నిరసన తెలిపేందుకు సిఐటియు నేతృత్వంలో వర్కర్లు సిద్ధమవుతున్నారు. విశాఖ పోర్టులో అధికారులు, ఉద్యోగుల ఖాళీల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. రిటైర్‌మెంట్ అవుతున్నా సరే ఆ ఖాళీల్లో భర్తీకి మేజర్ పోర్టుల అథారిటీ చట్టం ప్రకారం యాజమాన్యం ససేమిరా అంటోంది. ఉన్నవారితోనే పోర్టు కార్యకలాపాలు సాగించడం విశేషం.

ఆందోళనలో పోర్టు వర్కర్లు

బడ్జెట్‌లో నిధుల కోత...

గత బడ్జెట్‌లో వైజాగ్ పోర్టు ట్రస్ట్‌కు రూ.276 కోట్ల కేటాయింపు చేసి ఈ సారి బడ్జెట్‌లో రూ.126కోట్ల మేర తగ్గించేశారు. కేవలం రూ.150కోట్లనే 2024-2025 బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ మంజూరు చేశారు. దీంట్లో విడుదలయ్యే బడ్జెట్ ఎంతో కేంద్రానికే ఎరుక? ఏటా కార్గో హ్యాండ్లింగ్ ద్వారా రూ.వందల కోట్లు వైజాగ్ పోర్టు ఆర్జిస్తున్నా కొత్తగా డైరెక్టర్ల పాలనకు శ్రీకారం చుట్టేలాగ నూతన చట్టం అనుమతినిస్తోంది. త్వరలో జరిగే ఉన్నతస్థాయి నియామకాలు సైతం కేంద్రం నుంచే

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కార్పొరేటీకరణతో స'పోర్టు' ఉంటుందా?

రానున్నాయి. దీంతో ప్రభుత్వ పోర్టు అన్న భావన రానున్న కాలంలో కనుమరుగై 'ల్యాండ్ లార్డ్' ప్రైవేట్ ఆపరేటర్‌గా విపిటి మారే అవకాశాలు దర్శనమిస్తున్నాయి. ఈ విధానంతో పోర్టు ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరం కానుందన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

825 ఎకరాల్లో ఆకు మడులు నీట మునక

అనకాపల్లి, మునగపాక, కశింకోట, యలమంచిలి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, చోడవరం, బీడికాడ, కోటవురట్ల, మాకవరపాలెంలో ఆకు మడులు దెబ్బతిన్నాయి. మండలాల వారీగా వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం 14 మండలాల్లోని సుమారు 2,662 మంది రైతులకు చెందిన లోతట్టు 94 గ్రామాల్లో 320 ఎకరాల ఆకు మడులు, 475 ఎకరాల్లో ఎద నష్టపోయింది.

జిల్లాలో వర్షాలకు ఆకుమడులు దెబ్బతిన్న రైతులకు వరి విత్తనాల పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి జి.మోహనరావు తెలిపారు. ఆర్‌జిఎల్ 2537 రకం వరి విత్తనాలు 316 క్వింటాళ్లు, బిపిటి 5204 రకం 19 క్వింటాళు, ఎంటియు 1224 రకం 2.5 క్వింటాళ్లు, ఎంటియు 1121 రకం 10 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపామన్నారు.

రైళ్ల నియంత్రణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సెంట్రల్ రైల్వేలోని పూణే డివిజన్‌లోని దౌండ్ స్టేషన్‌లో ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ కమిషన్ కోసం ప్రీ/నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు, నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా 118520 లోకమాన్య తిలక్ టెర్మినస్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ లోకమాన్య తిలక్ టెర్మినస్ రైలు ఈ నెల 29 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు షోలాపూర్-దౌండ్-పూణేకు బదులుగా పూణే - మిరాజ్ -కుర్దువాడి మీదుగా మళ్లించిన మార్గంలో నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. 22882 భువనేశ్వర్ - పూణే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30న షోలాపూర్‌లో షార్ట్ టర్మినేట్ చేయబడుతుందని, ఆ రోజు షోలాపూర్-పుణె మధ్య ఈ సర్వీసు ఉండదని, ప్రజలు మార్పులను గమనించాలని అధికారులు కోరారు.

వాతావరణం వేడెక్కకుండా కృషి చెయ్యాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: వాతావరణం వేడెక్కకుండా యువత కృషి చెయ్యాలని భారత ప్రజారోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎంవివి మురళీ మోహన్ కోరారు. ఎంవిపి కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో ఒడిశాకు చెందిన వ్యాస్ సంస్థ నేతృత్వంలో ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ సహకారంతో బుధవారం క్లైమేట్ యూత్ అవేర్‌నెస్ వర్క్ షాప్ నిర్వహించారు. ఔషధ వనంలో మొక్కలు పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా, ఒత్తిడికి దూరంగా జీవించాలంటే ప్రకృతి ఆధారిత పంటలు పండించిన ఆహారాన్నే ఆరగించాలన్నారు. ప్రతి వర్షపు చుక్కనూ ఒడిసి పట్టి భూగర్భంలోనికి ఇంకేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు, జివిఎంసి సస్టైనబుల్ రిజిలియన్స్ యూనిట్ ప్రతినిధి వివేక్, పర్యావరణ వేత్త హేమలత, టీచింగ్ ఫ్యాకల్టీ రాజా ప్రవీణ, కోటేశ్వరరావు, వ్యాస్ సంస్థ కో-ఆర్డినేటర్ జె.రాజేశ్వరి, ఎస్ఆర్‌యు జివిఎంసి ప్రతినిధి దివ్య, పర్యావరణ కన్సల్టెంట్ జెవి రత్నం, పలువురు విద్యార్థులు మాట్లాడారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి

సమావేశంలో పాల్గొన్న పెన్షనర్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇపిఎస్ పెన్షనర్ల పెన్షన్ కనీసం రూ.9 వేలు చేయాలని, మెడికల్ సదుపాయం కల్పించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్, జిల్లా కార్యదర్శి ఎస్‌కె హుస్సేన్ డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం అసోసియేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇపిఎస్ పెన్షనర్ల ధర్నాకు హాజరై వచ్చిన నాయకులు ఈ సమావేశంలో అక్కడి పరిణామాలను వివరించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చి పదేళ్లు పూర్తయినా ఇపిఎస్ పెన్షనర్ల పెన్షన్ పెంచలేదని, ఇతర డిమాండ్లను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రోజురోజుకూ నిత్యావసర వస్తువులతో పాటు అన్నింటి ధరలు పెరిగిపోతున్నాయని, ఈ పరిస్థితులలో కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో కెఎం.కుమారమంగళం, వై.అప్పారావు, రాంప్రభు మాట్లాడారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసిలో అధికారులు, ఉద్యోగులు పరిశుభ్రమైన వాతావరణంలో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాలను, సెల్లార్ ఫ్లోర్‌లో బ్యాటరీ కార్ పార్కింగ్ ఆవరణ, సౌకర్యం, సచివాలయం కేంద్రం విభాగాలను, ఉన్నతాధికారుల గదులను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, పలు విభాగాల్లో ఉద్యోగులతో మాట్లాడుతూ, విధుల నిర్వహణకు అనుకూలంగా గాలి, వెలుతురు ఉన్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో ఉద్యోగులకు కల్పించిన మౌలిక సదుపాయాల్లో లోపాలు ఉంటే వెంటనే ఆఫీసు ఇన్‌ఛార్జికి తెలియపరచాలన్నారు. పలుచోట్ల ఉద్యోగులకు కల్పించిన మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేవని, ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పర్యవేక్షించాలని ఆఫీస్ ఇంచార్జ్ డిఇఇ వెంకటేశ్వరరావును ఆదేశించారు. ప్రధాన కార్యాలయంలో ఆవరణలో నీడనిచ్చే మొక్కలను నాటాలని డిడిహెచ్ ఎం.దామోదర రావును ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిచేయాలని, కార్యాలయంలో అస్తవ్యస్తంగా ఉన్న వ్యర్థాలను తొలగించి, వినియోగానికి పనికిరాని వస్తువులను వేలం వేయాలని, కార్యాలయంలో పలుచోట్ల చీకటిని గమనించి విద్యుత్ బల్బులను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. అన్ని విభాగాలలో సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణరాజును కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ వాసుదేవరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, పర్యవేక్షక ఇంజనీర్లు కెవిఎన్.రవి, వినయ్‌కుమార్, వేణుగోపాల్, కృష్ణారావు, యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంవిడి ఫణిరామ్, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై వినతి

జివిఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి విలీన పంచాయతీలు, యుజిడి, వెటర్నరీ, పార్కులు, ఆఫీసులలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జివిఎంసి నూతన కమిషనర్ సంపత్ కుమార్‌కు జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, భీమిలి, గాజువాక జోన్ బాధ్యులు ముద్దాడ వరప్రసాద్, గొలగాని అప్పారావు మాట్లాడుతూ, జివిఎంసిలో గాజువాక మున్సిపాలిటీతో పాటు 32 గ్రామపంచాయతీలు విలీనం జరిగి ఎన్నో ఏళ్ళు జరుగుతున్నప్పటికీ, ఈ ప్రాంతాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు టైం స్కేల్ ఇవ్వడం లేదని, తక్షణం అమలు చేయాలని కోరారు. యుజిడి కార్మికులకు కొత్త వేతనాలు అమలకు సంబంధించి పెండింగ్ ఉన్న ఫైలును క్లియర్ చేయాలని, వెటర్నరీ కార్మికులు, డ్రైవర్లకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, పబ్లిక్ హెల్త్ లో పనిచేస్తున్న కార్మికులకు రూ.21 వేలు వేతనం ఇవ్వాలని, కుక్కలు తరలించే డ్రైవర్లకు రూ.24,500, పార్కు కార్మికులకు రూ.21 వేలు వేతనం ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, శ్రావణ్, కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

27న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని, జిల్లా పరిషత్ సిఇఒ ఎం.పోలినాయుడు కోరారు. అన్ని శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

దళితులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దళిత మహిళలపై దాడులకు పాల్పడుతూ అత్యాచారానికి ప్రయత్నించిన దేవరపల్లి గణేష్‌ను అరెస్టు చేయాలని, దళిత మహిళలను అసభ్య పదజాలంతో కించపరిచిన పద్మనాభం సిఐ, ఎస్ఐలపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విశాఖ జిల్లా పద్మనాభం మండలం పెంట గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. పద్మనాభంలో ఉన్న దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేసేందుకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. పెంట గ్రామ సర్పంచ్ బోదల పావని మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలందరూ ఉపయోగించే రహదారిని దేవరపల్లి గణేష్ ఆక్రమించి అడిగిన వారిని కొట్టడం, చంపుతానని బెదిరించడం, కత్తులు, గొడ్డలి పట్టుకొని భయాందోళనలకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. పద్మనాభం సిఐ, ఎస్ఐలతో దిగిన ఫొటోలు చూపిస్తూ అందర్నీ జైలుకు పంపిస్తానని గణేష్ బెదిరింపులు చేస్తున్నారని ఆరోపించారు. దళిత నాయకుడు దేవరపల్లి గణేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, పోలీస్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగలేదన్నారు. అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న దేవరపల్లి గణేష్, అతని భార్య రమణమ్మ, కుమారుడు పైడిరాజులను శిక్షించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి కోటేశ్వరరావు, విశాఖ సిటీ ప్రెసిడెంట్ డి.జోసఫ్, కుమార్, జి.దుర్గాప్రసాద్, అంబేద్కర్ సంఘ సభ్యులు అలమండ వెంకటలక్ష్మి, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

10 టీవీ బ్యూరో చీఫ్ జార్జికి డాక్టరేట్

ప్రజాశక్తి-ఎంవిపీ కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి, 10 టీవీ బ్యూరో చీఫ్ భూపతి జార్జి ఫెర్నాండేజ్‌కు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో 'సమాచార హక్కు చట్టం- పత్రికల పాత్ర - మీడియా ప్రచురించిన కథనాలు' అంశంపై జార్జి ఫెర్నాండేజ్ పరిశోధనలు చేశారు. ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ చేతుల మీదుగా బుధవారం జార్జికి డాక్టరేట్‌ను అందజేశారు. పరిశోధక విద్యార్థులను ఎయు ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు అభినందించారు.

IN THE HONOURABLE COURT OF THE VIIth SPL. MAGISTRATI AT VISAKHAPATNAM
STC 4871 / 23

Between:
Dr. D.S. Raju . . . Complainant
And:
I.Srinivasa Rao . . . Accused

NOTICE

Accused: Idupulapati Srinivasa Rao
S/o. Radhakrishna Murthy, Lotus Apt. Ground Floor, Opp. Minerva School, B.S.Layout Seethammadhara,Visakhapatnam.

Whereas the above named complainant has instituted a Complaint U/s 138 & 142 of N.I.Act against you for the petiton claim, you are hereby summoned to appear in the court inperson or by a pleader duly instructed and able to answer all material question relating to the Complainant or who shall be accompanied by some person able to answer on the 20-8-2024 at 10-30 A.M., in the forenoon to answer the claim and at the day fixed for you appearance in default of your appearance on that day and hour before mentioned the Complainant will be heard and determined in your absence.

(By Court Order)
G.T.V.MALLESWARA RAO
Advocate, # 26-1-91/B, 2nd Floor, Durgalamma Temple, Poorna Market Roads, Visakhapatnam-530 001
Visakhapatnam Cell : 9440110819
Dt. 24-7-2024

IN THE HON'BLE COURT OF THE VIIth ADDL. DIST JUDGE AT: VISAKHAPATNAM
E.P.No. 141/22 O.S.No. 212/2009

Between:
Umaraju Sagi . . . D.Hr
And:
K.Srinivasa Rao . . . JDR
JDR:
Kunapureddy Srinivasa Rao
S/o. Late Ankala Rao, D.No. 39-7-56, Srinivas Apt. Murali Nagar, Visakhapatnam.

పై నెంబరు అమలును రూ. 24,93,739/-లు వసూలు నిమిత్తం మీ యొక్క స్థిరాస్తిపై వేలం నోటీసు మీకు ఎన్నిసార్లు పంపించినను మీకు చేరని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం తే: 28-8-2024దీకి వాయిదా అయివున్నది. కావున **తే: 28-8-2024దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు కేసును మీ పరోక్షమందు తీర్మానించబడ మగును..

(By Court Order)
L.SATYANARAYANA
Advocate, Ramachandra Residence D.No. 10-4-20, Ramnagar, Visakhapatnam.
Visakhapatnam
Dt. 24-7-2024 Cell : 9440584322

IN THE HON'BLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.A.82/2023 in E.A.83/2023 in E.A.51/2023 in E.P.392/2019 in I.A.138/2017 in O.S.363/2017

Between:
Sri Dondapati Narayana Reddy ...Petitioner/Claim Petitioner
And:
1) Smt. Renu Vijaya Kumar . . . .Respondent No.1/ Respondent No.1/ Plaintiff/D.Hr
2) Kandikatla Vidya Sanjeev . . . Respondent No.2/ Respondent No.2/Defendant/J.Dr

NOTICE

To,
R-2: Kandikatla Vidya Sanjeev, W/o. K. Sanjeeva Kumar, aged 53 years, C/o. John Robert Baday, Flat No.402, TSR Arcade, Near Audi Showroom, Resapuvani Palem, Visakhapatnam.

Please take notice that the above-named petitioner filed the above E.A. against you and the other Respondent (Smt. Renu Vijaya Kumar). As per the Order of the Hon'ble Court dated 10-05-2024, the petitioner is hereby serving notice upon you by way of this Publication. The matter is stands posted to **09-08-2024** for your appearance in person or through your Advocate, failing which the matter will be heard and decided in your absence.

(By Order of the Hon'ble Court)
V. SRUJAN VEGI, Advocate, Visakhapatnam, Cell: 9398902301

IN THE HON'BLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.A.83/2023 (G.R.No.2399, dt.02-08-2023) in E.A.51/2023 in E.P.392/2019 I.A.138/2017 in O.S.363/2017

Between:
Sri Dondapati Narayana Reddy ...Petitioner/Claim Petitioner
And:
1) Smt. Renu Vijaya Kumar . . . .Respondent No.1/ Respondent No.1/ Plaintiff/D.Hr
2) Kandikatla Vidya Sanjeev . . . Respondent No.2/ Respondent No.2/Defendant/J.Dr

NOTICE

To,
R-2: Kandikatla Vidya Sanjeev, W/o. K. Sanjeeva Kumar, aged 53 years, C/o. John Robert Baday, Flat No.402, TSR Arcade, Near Audi Showroom, Resapuvani Palem, Visakhapatnam

Please take notice that the above-named petitioner filed the above E.A. against you and the other Respondent (Smt. Renu Vijaya Kumar). As per the Order of the Hon'ble Court dated 10-05-2024, the petitioner is hereby serving notice upon you by way of this Publication. The matter is stands posted to **09-08-2024** for your appearance in person or through your Advocate, failing which the matter will be heard and decided in your absence.

(By Order of the Hon'ble Court)
V. SRUJAN VEGI, Advocate, Visakhapatnam, Cell: 9398902301

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT ANAKAPALLE
O.S. 54/2023

Between:
Smt Lalam Lova Lakshmi ...Plaintiff
And:
1. Smt Kotana Demudamma
2. Kotana Venkata Satyanarayana
3. Kotana Bala Venkata Subrahmanyam
4. Vennela Padma ... Defendants

SUMMON

To
Defendant No: 4
Smt Vennela Padma W/o Vennela Venkata Rao D/o Kotana late Demudu D.No 43-17-23 Venkata Raju Nagar T.S.N. Colony Visakhapatnam-530 016

Please take notice that the above suit, which is filed against you and other defendants for partition of the plaint schedule properties into five equal shares and allot one such share to the plaintiff, stands posted to 19-08-2024 for your appearance. If you have any objections you may attend either personally or through an advocate before the above said Court at **10.30 A.M. on 19-08-2024** failing which the matter will be decided exparte in your absence.

(By order of the Court)
KANDREGULA LEELA HARI PRASAD
Advocate Gajuwaka
Visakhapatnam, Visakhapatnam-26
Dt. 24-7-2024 Cell: 81432 72790

రాయితీపై స్వయంఉపాధి రుణాలివ్వాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎస్సి, ఎస్టి, బిసి యువత స్వయం ఉపాధికి సంబంధిత కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలివ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుక్కోటి చిరంజీవి డిమాండ్ చేశారు. అలాగే ఎస్సి,ఎస్టి సబ్‌ప్లాన్ నిధులను కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. బుధవారం ఎఎస్ఆర్ నగర్‌లో గౌరీష్ అధ్యక్షతన కెవిపిఎంస్ అక్కయ్యపాలెం జోన్‌కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో రిజర్వేషన్లను కోల్పోయి, దళిత, గిరిజన, బలహీన వర్గాల యువత నిరుద్యోగిత పెరుగుతోందని, ఈ నేపథ్యంలో వారి స్వయంఉపాధికి సంబంధిత కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరంజీవి

రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. విశాఖ స్టీల్ సిటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, పోరాడి సాధించుకున్న ఎస్సి, ఎస్టి సబ్‌ప్లాన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయక, ఆయా వర్గాలకు ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. ఎస్సి, ఎస్టి నివాసప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి, అభివృద్ధి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గౌరీష్ అధ్యక్షునిగా, వెంకన్న ప్రధాన కార్యదర్శిగా, 13 మందితో అక్కయ్యపాలెం జోన్ కెవిపిఎస్ కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో పౌరసంక్షేమసంఘం నాయకులు అప్పలరాజు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న, ఉపాధ్యక్షులు వై.రాజు స్టీల్ డివిజన్ ఉపాధ్యక్షులు పుల్లయ్య పాల్గొన్నారు.

ఆర్థిక నేరాలను అరికట్టాలి

ప్రజాశక్తి-ములగాడ: ప్రైవేటీకరణ నేపథ్యంలో ఆర్థిక నేరాలను అరికట్టి, దోపిడీని నివారించాలని, కార్మిక హక్కులను ప్రభుత్వాలు కాపాడాలని ఎన్‌సిసి జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నూతన ఆర్థిక విధానం 1991- తీరుతెన్నులు'పై సదస్సులో మాట్లాడుతూ, నూతన ఆర్థిక విధానం వల్ల ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చేశాయన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు లేకుండా చేసాయన్నారు. ఆర్థిక అసమానతలు పెరిగి సమసమాజం ఒక నినాదంగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్థశాస్త్ర అధ్యాపకుడు బిపి.రాజు మాట్లాడుతూ, నూతన ఆర్థిక విధానాలతో ఉత్పత్తి, నాణ్యత, సమర్థత పెరిగి, పోటీ ప్రపంచంలో నవ కల్పనలు సాధ్యపడ్డాయన్నారు. సమావేశంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు అనసూయా దేవి, అర్థశాస్త్ర అధ్యాపకులు సలోమి మాట్లాడారు.

జలజీవన్ మిషన్ కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని కణమాం, వెంకటాపురం, గొట్టిపల్లి, గిడిజాల తదితర గ్రామాలలో కేంద్ర జల జీవన్ మిషన్ బందం పర్యటించి, పథకాలను పరిశీలించింది. జలజీవన్ మిషన్, పారిశుధ్యవిభాగాలకు చెందిన కేంద్రబృందం ప్రతినిధులు ఘజాన్ఫర్ అహ్మద్, మాత్యూ జార్జ్, ఇతర సభ్యులు ఆయా గ్రామాల్లో ప్రజలతో సమావేశమై ఇప్పటివరకు అమలు చేసిన జలజీవన్ మిషన్ పథకాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. నీటినాణ్యత, నీటినిల్వలు, పారిశుధ్యం, స్వచ్ఛభారత్ మిషన్ తదితర అంశాలపై పరిశీలించారు కార్యక్రమంలో జెజెఎం జిల్లా ఇన్‌ఛార్జి స్వప్న, జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య, వైస్‌ఎంపిపి పాండ్రంకి శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు షినగం అప్పలరాజు, గంటా జగదీశ్, ఆబోతు అప్పల నాయుడు, ఎంపిటిసి దొంతల కనక రాజు, తాడివాడ శివకృష్ణ, ప్రశాంత్

పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

కుమార్, మాజీ సర్పంచ్ కోరాడ నాయుడు బాబు, ఎంపిడిఒ నల్లారి అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి కె.రామా రావు, ఆర్డబ్ల్యూఎస్ డిఇఇ దుర్గాంబ, ఎఇఇ ఎస్ఎస్ఆర్. మూర్తి, జల జీవన మిషన్ ఎస్‌బిఎం ఎ.తిరుమల రావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీరామమూర్తి, పి.రామారావు, చందక ఝాన్సీ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల అక్రమాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని వేములవలస గ్రామంలో జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలపై జిల్లా కలెక్టర్ హరింధర్‌ప్రసాద్‌కు భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు కలిసి వినతిపత్రం అందజేశారు. వేములవలసలో స్థానికులకు, అర్హులకు కాకుండా, వైసిపి బినామీలకు, అనర్హులకు పట్టాలు ఇచ్చారని, దీనిపై పరిశీలన జరిపి న్యాయం చేయాలని కోరారు.

'బెహరా'ను చేర్చుకుంటే ఒప్పుకోం

ప్రజాశక్తి- గోపాలపట్నం : వైసిపి మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావును జనసేన పార్టీలో చేరిస్తే సహించబోమని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు స్పష్టం చేశారు. బెహరా జనసేనలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమౌతున్న నేపథ్యంలో బుధవారం 92వ వార్డు జనసేనకార్యాలయం వద్ద సమావేశమై చర్చించారు. బెహరాతోపాటు అతని సతీమణి స్వర్ణలత, కోడలు కుంచె జ్యోత్స్నలు జనసేనలో చేరికను ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. దీనిపై అధిష్టానానికి గట్టిగా నివేదిస్తామంటున్నారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన అవసరం

జైళ్లశాఖ ఐజి శీనివాసరావుని సత్కరిస్తున్న కెకె.మీనా

ప్రజాశక్తి - ఆరిలోవ : కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలపై జైళ్ళశాఖ అధికారులు అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కె.మీనా అన్నారు. బుధవారం విశాఖ కేంద్రకారాగారంలో నిర్వహించిన మూడు రోజుల జాతీయ సమావేశాలు ముగిసాయి.. దామోదరం సంజీవయ్య, డాక్టర్ అంబేడ్కర్, ఎన్‌విపి, ఎయు న్యాయ కళాశాలల ప్రొఫెసర్లు పాల్గొని కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అనే కొత్త నేర చట్టాలపై జైళ్లశాఖ అధికారులకు అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేసారు.కార్యక్రమంలో కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్ కుమార్, అదనపుపర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్త జైళ్ల ఏర్పాటుకు సన్నాహాలు..

రాష్ట్రంలో అవసరమైన జిల్లాల్లో కొత్తగా జైళ్ళ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర జైళ్ళశాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు అన్నారు. జాతీయ సమావేశాల ముగింపు సందర్భంగా విమాట్లాడుతూ, కొత్త జైళ్ల ఏర్పాటుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందన్నారు ఏయే జిల్లాల్లో జైళ్లు అవసరమో జిల్లా కలెక్టర్, ఎస్పి, జైలు పర్యవేక్షణాధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, ఎ నివేదికను ఇటీవల సుప్రీం కోర్టుకు పంపించామన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆటో నుంచి కిందిపడి, గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందాడు. బుధవారం ఎండాడ జాతీయ రహదారి వద్ద చోటు చేసుకున్న ఘటన వివరాలివి. . జాతీయ రహదారి పాత డెయిరీఫారం వద్ద ఎండాడ వెళ్ళేందుకు ఓ వ్యక్తి ఆటో ఎక్కాడు. ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్ద ఆటో నుంచి దిగే క్రమంలో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కిందకు జారిపడ్డారు. తీవ్రగాయాలైన గుర్తుతెలియని వ్యక్తిని 108లో కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడని ఆరిలోవ ఎఎస్ఐ నాయుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవాగారంలో ఉంచారు.

మృతుడు

ఏడు తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి-నక్కపల్లి: నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి 7 తులాల బంగారం నగలను దోచుకున్నారు. కాలనీలోని మాకుల సత్యనారాయణ భార్యతో కలిసి మూడు రోజుల కిందట కుమార్తె ఇంటికి జోగంపేట వెళ్ళాడు. మంగళవారం కొడుకు అంజి తన భార్యతో అనకాపల్లి ఆసుపత్రికి వెళ్లి అక్కడి నుంచి మాడుగులలో అత్తారింటికి వెళ్ళాడు. బుధవారం మధ్యాహ్నం సత్యనారాయణ ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలో బట్టలు చెల్లాచెదురుగా ఉండగా, పరిశీలించగా, ఏడు తులాల బరువైన రెండు గొలుసులు, ఉంగరాలు, ఇతర వస్తువులు దొంగలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ విజయ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకునిపరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏటి గైరంపేట చెక్‌పోస్ట్ వద్ద రెండు కేజీల గంజాయితో బాలుడిని పట్టుకున్నట్లు ఎస్ఐ. బి.కృష్ణారావు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా, గంజాయితో టి.అజ్జాపురం గ్రామానికి చెందిన బాలుడు పట్టుబడ్డాడని, కేసు నమోదు చేసి జువైనల్ హోమ్‌కు తరలించామన్నారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్: గంజాయి కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నర్సీపట్నం రూరల్ ఎస్ఐ భీమరాజు తెలిపారు. ఈ నెల 20న ధర్మసాగర్ జంక్షన్‌లో14 కేజీల గంజాయి తరలిస్తూ మైనర్ పట్టుబడిన ఘటనలో వీరిద్దరు నిందితులన్నారు.. గొలుగొండ మండలం గుండుపాల గ్రామానికి చెందిన కాకర రాజేష్, డొక్కా వరప్రసాద్ నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పారిశ్రామిక ప్రాంత సమస్యలపై వినతి

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్ కుమార్‌ను బుధవారం పారిశ్రామిక ప్రాంత కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సత్కరించి అభినందించారు. పారిశ్రామిక ప్రాంత సమస్యలను కమిషనర్‌కు వివరించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, ముర్రు వాణినానాజీ, గులిగిందల లావణ్య, పివి సురేష్, బల్ల లక్ష్మణరావుతోపాటు దాడి సత్యనారాయణ, పుర్రి సురేష్ యాదవ్, గులిగిందల కృష్ణ ఉన్నారు.

ఇసుకకు భలే డిమాండ్

ప్రజాశక్తి -భీమునిపట్నం: ప్రభుత్వం అందిస్తున్న ఇసుకకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది, స్థానిక కృష్ణాకాలనీ స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం కిలోమీటర్ల దూరం లారీలు బారులు తీరాయి. జిఎస్‌టి, లోడింగ్, రవాణా ఇతర చార్జీలను కలుపుకొని టన్నుకు రూ.758 చెల్లించి ఇసుక తీసుకెళ్తున్నారు

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యుత్ ఉద్యోగి దుర్మరణం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోనివేములవలస కొత్తబ్రిడ్జి సమీపంలో క్రేన్‌వ్యాన్ బ్రేక్ ఫెయిలై ఢీకొన్న ఘటనలో ఇదే గ్రామానికి చెందిన విశ్రాంత విద్యుత్‌శాఖ ఉద్యోగి షేక్ ఆలీ (75) దుర్మరణం పాలయ్యారు. బుధవారం ఉదయం 10గంటల సమయంలో జరిగిన దుర్ఘటనకు సంబంధించిన వివరాలివి.

వేములవలస పూల మార్కెట్ సమీపంలో స్థిర నివాసముంటున్న షేక్ ఆలీ, బుధవారం ఉదయం ఫ్యాన్ కొనేందుకు నడుచుకుంటూ మార్కెట్‌కు వెళ్తున్న సమయంలో బ్రేకులు ఫెయిలైన క్రేన్ ఆతనిని ఢీకొట్టి, మీదుగా వెళ్లడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. తీవ్రగాయాలైన ఆలీని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆలీని ఢీకొన్న క్రేన్ అక్కడే ఉన్న పోలీసు వాహనాన్ని ఢీకొట్టి, స్పీడ్‌బ్రేకర్ వద్ద ఆగిపోయింది. లేకుంటే భారీ ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు అంటున్నారు.

రోదిస్తున్న భార్య, మృతుడు షేక్ ఆలీ (ఫైల్‌ఫొటో)

డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుని కుటుంబీకులు ఆరోపించారు. అందిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ టివి.తిరుపతిరావు ఆధ్వర్యంలో హెచ్‌సి గాంధీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహానికి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యుత్ శాఖలో లైన్‌మ్యాన్‌గా నెల్లిమర్ల, ఎస్ కోట, గరివిడి, ఆవనాం, విశాఖపట్నంలో పనిచేసిన ఆలీ, చివరగా ఆనందపురంలో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా 2012లో రిటైర్డ్ అయ్యారు. వేములవలస పూల మార్కెట్ సమీపంలో మసీద్ నెలకొల్పి, ముస్లిం నాయకుడయ్యారు. మృతునికి నలుగురు సంతానం కాగా, ఒక్కగానొక్క కొడుకు 18ఏళ్ల వయస్సులో విజయవాడలో రోడ్డు ప్రమాదంలోనే మృత్యువాత పడ్డాడు.

ఆలీ భార్య జయనాధ్‌తో కుమార్తెలు సహనాజ్, సాహిన్, సహిర ఉన్నారు. వీరిలో రెండో కుమార్తె సాహీన్ విశాఖలో దంతవైద్యురాలిగా ప్రాక్టీస్ చేస్తోంది. ఆలీ మృతిపై ముస్లిములతోపాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వేములవలసలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వస్త్ర సంచుల వినియోగం పర్యావరణ హితం

కోరమండల్ ఫెర్టిలైజర్స్ సామాజిక బాధ్యత స్ఫూర్తిదాయకం : జివిఎంసి కమిషనర్ సంపత్ కుమార్

ప్రజాశక్తి- ములగాడ/ ఎంవిపి.కాలనీ : వస్త్ర సంచుల వినియోగం పర్యావరణ హితమని, కోరమండల్ ఫెర్టిలైజర్స్ విశాఖ నగరంలో చేస్తున్న సామాజిక సేవ స్ఫూర్తిదాయకమని జివిఎంసికమిషనర్ పి.సంపత్ కుమార్ కొనియాడారు. నగర ప్రజలకు ఉచితంగా అందించేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-ఎకో వైజాగ్ పేరిట కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ తయారు చేయించిన 30 వేల వస్త్ర సంచులను కమిషనర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ముందుగా కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, ఇతర ప్రతినిధులు జివిఎంసి నూతన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కోరమండల్ వైస్ ప్రెసిడెంట్ జ్ఞానసుందరం మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై నగర ప్రజల అవగాహనకు జివిఎంసి సౌజన్యంతో

గుడ్డ సంచులను ఆవిష్కరిస్తున్న జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ సామాజిక బాధ్యతతో పలు కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగంగానే ఇప్పుడు 30 వేల వస్త్ర సంచులను మార్కెట్‌లో, నివాసిత ప్రాంతాల్లో ఉచితంగా అందిస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ నగర పరిరక్షణకు, పరిశుభ్రతకు, నగరాభివృద్ధికి ప్రజలను చైతన్య పరుస్తూ వారి అవగాహనకు కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత ఎంతో దోహదపడుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2024లో విశాఖ నగరం దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచే దిశగా జివిఎంసి చేస్తున్న కృషికి ప్రజా సహకారమే ముఖ్య భూమిక అన్నారు. విశాఖ నగరంలో ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పాలని, పర్యావరణహితమైన వస్తువులే వినియోగించాలని కోరారు. దీనికి సహకరిస్తున్న కోరమండల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ ఫెర్టిలైజర్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు, సిఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎస్‌వి.రమణ, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) కె.శ్రీకాంత్, పిఆర్ కన్సల్టెంట్ యుఎస్.శర్మ పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్లు కేటాయించాలి

ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి -పిఎం పాలెం: వివిధ ప్రభుత్వ సంస్థలకు భూములిచ్చిన కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం తదితర గ్రామాల పేద, దళిత రైతులకు ఒప్పందం మేరకు ఇళ్లు కేటాయించకపోవడం అన్యాయమని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..బుధవారం బక్కన్నపాలెం ఎన్టీఆర్ హుదూద్ హౌసింగ్ కాలనీ వద్ద ఆందోళన కొనసాగించారు. ఏళ్లతరబడి న్యాయం చేయాలని పోరాడుతున్న రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు అప్పగించకుండా, విశాఖ ఉత్తర నియోజకవర్గ వాసులకు కేటాయించడం అన్యాయమన్నారు దీనిపై సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతుల ప్రతినిధులు ఎస్ పైడిరాజు, బి పోతురాజు, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, కెవిపిఎస్ నాయకులు ఎస్ పైడితల్లి, కె.నాగరాజు, ఎస్ నరసియ్యమ్మ, బి నరసియ్యమ్మ, సేన కన్నమ్మ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ వినతి

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -పద్మనాభం: విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు పద్మనాభం యుటిఎఫ్ నేతలు బుధవారం సాయంత్రం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ పి.రమణకు వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల శాఖ అధ్యక్షులు ఎన్.నారాయణరావు, ప్రధానకార్యదర్శి కె.సన్యాసిరావు, జిల్లా కౌన్సిలర్ పివి.రమణ, నాయకులు జి.భాస్కరరావు పాల్గొన్నారు.

వరినారుమళ్ల సంరక్షణకు సూచనలు

ప్రజాశక్తి -ఆనందపురం: వీడకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరినారుమళ్ళ సంరక్షణపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పలు సూచనలు చేశారు. బుధవారం మండలంలోని బోని గ్రామంలో ముంపు నారుమళ్లను అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం..విశాలాక్షి, శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి , విశాఖపట్నం జిల్లా వనరుల కేంద్రం అధికారి సిహెచ్. సుబ్రమణ్యం, భీమిలి ఎడిఎ బొడ్డేపలి. విజయ్‌ప్రసాద్, ఎఒ సిహెచ్ .సంధ్య రత్నప్రభ బృందం పర్యటించి పరిశీలిచారు. వీలైనంత త్వరగా నారుమళ్లలోని నీరు పోయేలా చేయాలని సూచించారు. ఇతర సాగు, సంరక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు.

కొండచిలువ హల్‌చల్

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ, అంబేద్కర్‌నగర్, హిల్‌వ్యూ రెసిడెన్సీ అపార్టుమెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి కొండచిలువ హల్‌చల్ చేసింది. ఏడు అడుగుల కొండచిలువ అపార్టుమెంట్లోకి చొరబొడడంతో నైట్ వాచ్‌మ్యాన్, స్థానిక ఆటోడ్రైవర్ దాన్ని గుర్తించి అపార్టుమెంటు వాసులను అప్రమత్తం చేసారు. వారు చాకచక్యంగా కొండ చిలువను గోనె సంచెలో బంధించి, సురక్షితంగా జూపార్క్‌కు అప్పగించారు. పోలీసులు, స్నేక్ క్యాచర్స్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ, వారు వచ్చేలోగానే కొండచిలువను ప్రాణాలతో బంధించి అప్పగించిన అపార్ట్‌మెంట్ వాసులను సిఐ గోవిందరావు అభినందించారు.

ఎయు బిజినెస్ స్కూల్ డిడిగా విశ్వనాథం

విశ్వనాథంకు శుభాకాంక్షలు చెబుతున్న ఎయు ఆచార్యులు

ప్రజాశక్తి- విశాఖపట్నం: ఆంధ్ర యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, డిప్యూటీ డైరెక్టర్‌గా విశ్రాంత ప్రొఫెసర్ పి విశ్వనాథం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎయు కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ పూర్వ విభాగాధిపతిగా, ప్రస్తుతం గౌరవాచార్యులుగా పనిచేస్తున్న విశ్వనాథం డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడంపై ప్రస్తుత హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ జాలాది రవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రవి మాట్లాడుతూ, విశ్వనాథంను డిడిగా నియమించిన ఎయు ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ జి. శశిభూషణ్‌రావు యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. మాతృసంస్థకు ప్రస్తుతం డిడిగా బాధ్యతలు నిర్వహించే స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌కు విశ్వనాథం వారధిగా పనిచేయాలనిఆకాంక్షించారు.

ప్రొఫెసర్ పి.విశ్వనాథం స్పందిస్తూ తనకు డిడిగా బాధ్యతలు అప్పగించిన యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అందరి సమన్వయం, సహకారంతో మేనేజ్‌మెంట్ విద్యకు ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశంలోనే అగ్రగామి సంస్థగా కొనసాగేలా కృషి చేస్తానన్నారు. మాజీ ప్రొఫెసర్ కె..సాంబశివరావు మాట్లాడుతూ డిసిఎంఎస్ సిబ్ సంయుక్తంగా, పరస్పర సహకారంతో ముందుకు సాగేలా విశ్వనాథం పనిచేయాలని హితవు పలికారు కార్యక్రమంలో ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ రమణమూర్తి, డాక్టర్ బి.సైలేష్ కుమార్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ బుజ్జిబాబు, డాక్టర్ సురేష్, డాక్టర్ నీరజ రతన్ తదితరులు పాల్గొని ప్రొఫెసర్ విశ్వనాథంకు శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధ మహిళకు కిమ్స్ ఐకాన్‌లో అరుదైన చికిత్స

ప్రజాశక్తి -గాజువాక: విశాఖపట్నానికి చెందిన 68 ఏళ్ల వృద్ధురాలికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ వైద్యులు అరుదైన చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. తీవ్రమైన తలనొప్పి, ఎడమ కంటి కనుపాపలు వాలి పడిపోతుండటం, స్పృహ కోల్పోవడం, వాంతులు కావడం లాంటి సమస్యలతో తొలుత ఆస్పత్రిలో చేరిన మహళకు ఎంఆర్ఐ స్కాన్‌లో మెదడు రక్తనాళాల్లో ఎన్యూరిజం పగిలిపోయినట్లు గుర్తించారు. ఆసుపత్రిలో చేరిన వెంటనే స్ట్రోక్ రావడంతో కుడికాలు కదపలేని పరిస్థితి ఏర్పడింది. దానికి మరికొన్ని పరీక్షలు, యాంజియోగ్రామ్ చేసి మెదడు రక్తనాళంలో పూడికను గుర్తించారు.

డాక్టర్ వెంకటేష్ పోతుల నేతృత్వంలోని వైద్యబృందం రక్తనాళం పూడికకు మెకానికల్ థ్రాంబెక్టమీ, పగలిపోయిన ఎన్యూరిజంకు ఫ్లోడైవర్టర్ ప్లేస్‌మెంట్ రెండు చికత్సలూ ఒకేసారి చేశారు. సమగ్ర విధానంతో మూడు సమస్యలూ ఒకేసారి పరిష్కారం కావడం, చికిత్స విజయవంతం కావడంతో రోగి ఎలాంటి సమస్యలు లేకుండా తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది.

ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ పోతుల మాట్లాడుతూ, ఎవరికైనా ఇటువంటి లక్షణాలు కనిపించగానే సరైన ఆస్పత్రిలో, సరైన వైద్యుడికి చూపించుకుని, సరైన చికిత్స చేయించుకోవాలన్నారు. సరైన ఇంటర్వెన్షనల్ రేడియాలజీ చికిత్స వల్ల కోలుకునే సమయం గణనీయంగా తగ్గుతుందన్నారు. లక్షణాలు కనిపించిన తర్వాత నిర్లక్ష్యం చేస్తే, ప్రాణాపాయంతోపాటు ఇతర సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని డాక్టర్ వెంకటేష్ హెచ్చరించారు.

తాగునీటి పైపులైన్ల మరమ్మతులు

ప్రజాశక్తి-పద్మనాభం.: మండల కేంద్రమైన పద్మనాభంలో సర్పంచ్ పాలన పాప ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా పైపులైన్ల మరమ్మతులు రెండు రోజులుగా చేపడుతున్నారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా, వర్షాలతో కలుషితనీరు సరఫరాకు అస్కారం లేకుండా పైపులైన్‌ను బాగుచేస్తున్నట్లు సర్పంచ్ పాప తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో కార్మికులు పైపులైను పనులు చేస్తున్నారు

టమాటా స్టాళ్ల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో రాయితీపై కిలో రూ.54కే టమోటాలను అమ్ముతున్న స్టాళ్లను జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి యాసిన్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించే ఈ స్టాళ్లలో కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు వహించాలని ఎస్టేట్ ఆఫీసర్ పి కొండబాబుకు సూచించారు.కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు.

భీమిలి క్రాస్‌రోడ్ వద్ద తనిఖీలు

ప్రజాశక్తి -అనందపురం : మండలంలోని భీమిలి క్రాస్‌రోడ్డు పోలీస్ చెక్‌పోస్టు వద్ద బుధవారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో డిఎస్ఇఒ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, అక్రమ మద్యం, ఇతర మత్తు పదార్థాలు నివారణకు చేపట్టే చర్యల్లో భాగంగా సిపి శంకబ్రత బాగ్జీ ఆదేశాలతో సెబ్ డిఎస్ఇఒ బి.శ్రీనివాసరావు, సెబ్ ఎఎస్‌పి యు.సుబ్బారావు పర్యవేక్షణ లో తనిఖీలు చేపట్టారు. సెబ్ సిఐ వి.రామకృష్ణ, సిబ్బంది కెవిబి.రావు, ఎస్.దేముడుబాబు, వహీదా, రాణి ఉన్నారు.

సంప్రదాయ ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం: సాంప్ర దాయ ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ ఎం జ్యోతికుమారి చాత్రోపాధ్యాయులకు సూచించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా బుధ వారం ఛాత్రోపాధ్యాయులకు బొంగరాలు, అష్టా చెమ్మా, టక్ ఆఫ్ వార్, కుర్చీలాట, తొక్కుడు బిల్ల తది తర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, అధ్యాపకులు నాగేశ్వరరావు, గొట్టేటి రవి, ఎం మహాలక్ష్మి, జె మాధవి, సోమయాజులు పాల్గొన్నారు

తైక్వాండోలో మధురవాడ క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి -మధురవాడ: ఇటీవల నడుపూరు ఉక్కు కళావేదికలోజరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడ యూత్ తైక్వాండో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ పోటీల్లో 41 మంది పాల్గొనగా 25 బంగారు పతకాలు, 10 రజత పతకాలు, 6 కాంస్య పతకాలతో మొదటి స్థానంలో నిలిచి, వచ్చేనెల 3,4తేదీల్లో తాడిపత్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తైక్వాండో అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా కార్యదర్శి ఎం అచ్చుంనాయుడు తెలిపారు.

మధురవాడ నుంచి పోటీల్లో పాల్గొన్న వారిలో ప్రణీత్ సాయి, క్రాంతికుమార్, జితీష్‌కుమార్, హర్షవర్ధన్, సుధీర్, గౌతంసాయి, లకుందాస్, సాత్విక్, దీపక్, మేఘా తనీష్, వంశిక సాయిదుర్గ, భావనశ్రీ, గాయత్రి, అపూర్వ, సాయి శ్రీనివాస్, విశాల్, సాయి ప్రతాప్, జస్వంత్ సాయిసూర్య, ధనలక్ష్మి, నిత్యశ్రీ, బాషిత, జ్ఞానసిరి, నితేష్ కుమార్, మణికంఠ, ఉదయ్ నిఖిల్, హాసినిలకు 23బంగారు పతకాలు, ముఖేష్ కృష్ణ, కీర్తి, యశస్విని, కేదార్‌నాథ్, జస్వంత్, వివేక్ అభిసాయి, శ్రీకర రోహిత్ కుమార్, వైష్ణవి, తేజేశ్విని, బాలచంద్ర పది రజత పతకాలు, అజయ్, పునీత్ అతుల్, రిషిత, శాన్విక రామలక్ష్మి, గణేష్‌కుమార్, బిడిఎన్ సత్యనారాయణలకు ఆరు కాంస్య పతకాలు వచ్చాయని కోచ్ సురేష్ తెలిపారు. జిల్లా యూత్ తైక్వాండో కార్యదర్శి ఎం సురేష్, కోచ్ సుకుమార్ సంపత్, ప్రతిభ చూపిన క్రీడాకారులను అసోసియేషన్ జాతీయ కోశాధికారి పి అచ్యుతరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అచ్చింనాయుడు, నేషనల్ రిఫరీ శంకర్, క్రీడాకారుల తల్లిదండ్రులు అభినందించారు.

పతకాలు సాధించిన మధురవాడ క్రీడాకారులు

తుపాను బాధిత రైతులకు నష్టపరిహారం అందించాలని వినతి

ప్రజాశక్తి- మునగపాక

తుపాన్ ప్రభావంతో వరి నారుమడులు నీట మునిగి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ పాపారావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధక్షులు కర్రి అప్పారావు, సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ మండల కేంద్రం మునగపాకతో పాటుగా అత్యధిక గ్రామాలలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని, ఇందు కోసం రైతులు వరి నారు వేశారని తెలిపారు. అయితే తుఫాను కారణంగా వారం రోజులుగా కురిసిన వర్షాలకు నారుమడులు మునిగిపోయి 70 శాతం వరకు కుళ్లపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. 8 సెంట్లు నారుమడికి దమ్ము కూలి, విత్తనాలతో రూ.2500 వరకు ఖర్చవుతుందని, నారు నీట మునగడంతో రైతు ఆ మొత్తాన్ని నష్టపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కొంతమంది రైతులు నారుమడి వేసుకోలేక దమ్ము పట్టి విత్తనాలు ఎద జల్లిన రెండవ రోజు నుండే వర్షాలు కురిసి నీరు చేరడంతో ఎద పూర్తిగా నీట మునిగి రైతులకు రూ.10 వేలు వరకు నష్టం కలిగిందని తెలిపారు. తుఫాను విపత్తుకు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఎన్యుమరేషన్ చేసి నీట మునిగిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు బిజెఆర్ నాయుడు, ఎం జోగి నాయుడు, భీశెట్టి రాము, వేగి శివ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న రైతు, సిపిఎం నాయకులు

యూరియా పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్‌వై.అగ్రహారం రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం రైతులకు గ్రామ సర్పంచి కన్నూరు నాగభూషణం, ఉప సర్పంచి లెక్కల అచ్చిబాబు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రైతులకు కావలసిన యూరియాను కె.కోటపాడు, ఆనందపురం నుంచి తెచ్చుకోవలసిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు రైతుల సౌకర్యం కొరకు వ్యవసాయ అధికారులు ఆర్‌బికెల వద్దనే యూరియాను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రతి ఏడాది రైతులు వరి నాట్లు వేసే సమయంలో యూరియా కొరత ఏర్పడేదని, ఇప్పుడు ఆ పరిస్థితి రాకున్నా ముందుగా రైతులకు అవసరమైన మేరకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ఈ యూరియాను ఆర్‌వై అగ్రహారంతో పాటు శివారు ఉగ్గినవలస, పోతనవలస గ్రామాలకు చెందిన రైతులకు కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది కళ్యాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణ నడిబొడ్డున, జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని జివిఎంసి అనకాపల్లి జోనల్ కమిషనర్ అప్పయ్యనాయుడుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కొద్ది రోజుల నుంచి భారీ వర్షాలు పడడం చేత నగర ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున అనకాపల్లి జోన్ పరిధిలో యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు చిన్ని యాదవ్, సూది కొండ మాణిక్యాలరావు, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, నాగేశ్వరరావుచౌదరి, సాయిబాబా, కత్తిర రమణ తదితరులు పాల్గొన్నారు

మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక స్వయంభూ గౌరీశ్వర స్వామి గుడి (శివాలయం) వద్ద బుధవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి నిపుణులు 78 మంది కంటి రోగులను పరీక్షలు చేయగా 18 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఆలయ ప్రధానార్చకులు కొడమంచలి చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ శ్రీనిజ, ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన, శంకర్ ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, నర్సింగ్ స్టాఫ్ గిరిజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

నిరసన తెలుపుతున్న ప్రజలు, వ్యకాస నాయకులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

కేంద్ర ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఆకలిచావులకు ఆజ్యంపోసే బడ్జెట్‌గా ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బిటి దొర అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై బుధవారం దేవరాపల్లిలో సంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దొర మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10లక్షలు ఒక్కొక్క లబ్ధిదారునికి కేటాయించాలని కోరుతుంటే, ఈ ఏడాది మరింత తగ్గించడం దారుణమన్నారు. అంగన్వాడీలకు గత బడ్జెట్లో కంటే ఈసారి రూ.300 కోట్లు పైగా కుదించినట్లు చెప్పారు. నిధులు తగ్గించి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఎలా అందిస్తారని ప్రశ్నించారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులన్నీ పేపర్ మీద చూపే ఆర్భాటాలు తప్ప ఆచరణలో ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మణ, చిన్నారావు, ఎరకన్న దొర, దేముడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వుషు పోటీలకు 'సంస్కృతి' విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ : తమిళనాడు రాష్ట్రం కోయింబత్తూర్ నగరంలో ఈ నెల 26 నుండి 31 వరకు జరుగు 23వ జూనియర్ నేషనల్ వుషు ఛాంపియన్ షిప్ పోటీలకు స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి తెలిపారు. గత నెల 28వ తేదీన రాష్ట్ర వుషు సంఘం ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగిన 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ వుషు ఛాంపియన్షిప్‌లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన తమ పాఠశాల విద్యార్థులు రాహుల్ మిస్త్రీ, పి.అభినవ్, క్రిష్‌దేవనిలు జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ పోటీలలో పాల్గొను విద్యార్థులతో పాటు, కోచ్ రమ్యను పాఠశాల సీఈఓ కె.నిశాంత్ బుధవారం అభినందనలు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, సిఇఒ

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని గవరవరం పిహెచ్సి పరిధిలోగల గ్రామాల్లో స్టాప్ డయారియా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్సీ డాక్టర్ దీపిక మాట్లాడుతూ వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు వేడి పదార్థాలు తీసుకోవాలని, చేతులను శుభ్రంగా కడుక్కుని ఆహారాన్ని భుజించాలని సూచించారు. డయేరియా ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవికుమార్, శ్రీనివాసరావు, ఝాన్సీ, శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇవిఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం పక్కనే ఉన్న ఈవీఎం మిషన్లను భద్రపరిచిన ఈవీఎం గోదామును బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ తనిఖీ చేశారు. నెలవారి తనిఖీలలో భాగంగా తనిఖీ నిర్వహించారు. సిసి కెమెరాల పనితీరు, ఇతర పరిస్థితులను గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరమైన చర్యలు గురించి తెలుసుకొని, అప్రమత్తంగా ఉండాలని అక్కడ అధికారులను ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి వై శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, డిప్యూటీ తాసిల్దార్‌లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గోదాము వద్ద కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు

చెరువును తలపిస్తున్న జగనన్న కాలనీ

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఇటీవల కురిసిన వర్షాలకు చెరువును తలపిస్తోంది. మండలంలోని పైడివాడ అగ్రహారం పైడివాడ, ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 320 ఎకరాలలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేశారు. ఈ లేఅవుటు సరైన ప్రణాళికతో తయారు చేయకపోవడంతో దీనికి సరైన రోడ్డు మార్గం లేదు. అప్పట్లో సుమారు 60 అడుగుల రోడ్డు నిర్మిస్తామని చెప్పి రైతుల వద్ద నుండి భూములు బలవంతంగా సేకరించారు. కాని కనీసం ప్లాట్ లోకి వెళ్లడానికి సరైన మార్గం లేదు. ఈ మెగా లేఔట్ లోనికి వెళ్లడానికి 40 అడుగుల రోడ్డు కూడా ఏర్పాటు చేయకుండానే లేఔటు తయారు చేయడం విడ్డూరంగా ఉందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూముల్లో గతంలో నుంచి గెడ్డ వాగులు, చెరువు నీరు వెళ్ళేదని, కనీసం వాటిని నుంచి వచ్చే నీరు వెళ్లడానికి సరైన డ్రైనేజీలు నిర్మించకుండా వాటిని పూడ్చి వేసి లేఔట్ వేయడంతో వర్షం పడితే రోడ్డులు కోతకు గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. లేఔట్‌లో వేసిన కొన్ని రోడ్ల వెంబడి రిటర్నింగ్ వాల్స్ (సిమెంట్‌తో గోడ కడితే తప్ప) నిర్మిస్తే తప్ప వర్షం ముప్పు నుంచి తప్పించుకోవడం సాధ్యం కాదు. గతంలోని రైతులు అధికారులకు పలు మార్లు పిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ముందు ఈ వాల్స్ కడితే తప్ప మిగతా పనులు చేసిన ఉపయోగం లేదు. ఈ పనులపై దృష్టి పెట్టకుండా మిగతా పనులు చేయడం వలన రోడ్లు చిన్నపాటి వర్షాలకు కూడా కొట్టుకుపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

చెరువును తలపించేలా ఉన్న పైడివాడ అగ్రహారం లే అవుట్

అడుగడుగునా గోతులు.. ప్రయాణానికి అవస్థలు

మరమ్మతులకు నోచని బిఎన్ రోడ్డు

ప్రజాశక్తి-వడ్డాది

భీమిలి-నర్సీపట్నం (బిఎన్) రోడ్డులో అడుగడుగునా గోతులు పడ్డాయి. చిన్నపాటి వర్షం పడితే ఆ గోతుల్లో నీరు చేరి ఈ గోతుల లోతు తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా వడ్డాది బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్, బంగారు మెట్ట మర్రి చెట్టు జంక్షన్, ఎల్.సింగవరం దగ్గర మరింత అధ్వానంగా ఉంది. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించడం సాహసమే. వాహనదారులు, పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు. లెక్కలేనన్ని గోతులపై గతిలేక ప్రయాణం సాగిస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి. లోపూడి డాల్ఫిన్ డెయిరీ వద్ద కల్వర్టుకి రంధ్రం పడి ప్రమాదంగా మారింది. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు కర్రకి ఎర్ర గుడ్డ కట్టి ప్రమాద హెచ్చరికను తెలియజేశారు. గోతులు పూడ్చేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. విజయరామరాజు పేట కల్వర్టు వర్షపు నీటికి పూర్తిగా దెబ్బతింది. ఆ రోడ్డు గుండా రాక పోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షం పడితే నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కోసం రోడ్లు తవ్వి ఎక్కడికక్కడ గుంతలు వదిలేశారు. రోడ్లు గుంతలు పడి సంవత్సరాల తరబడి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు దీనిపై చొరవ తీసుకొని ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై గోతులు ఉన్న దృశ్యం

పైపులైన్ల కోసం తవ్వేయడంతో అధ్వానంగా ఉన్న రోడ్డు

అధ్వానంగా కొత్తపల్లి బుచ్చయ్యపేట తారురోడ్డు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం కొత్తపల్లి బుచ్చయ్యపేట గ్రామంలో తారురోడ్డు అధ్వానంగా తయారైంది. గ్రామంలో తాగునీటి పైపు లైన్ల కోసం రోడ్డు తవ్విని గుత్తేదారుడు దానిని సరిగా పూడ్చకుండా వదిలేయడంతో ఈ రహదారి అలా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఎక్కడికక్కడ గోతులు ఉండడంతో వర్షం పడితే బురద మయంగా మారిపోతుంది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్నోవేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాల ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి), డిపార్టమెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ సంయుక్తంగా బుధవారం అనకాపల్లి జిల్లా కొప్పాక జెడ్పి హైస్కూల్‌లో "ఇన్నోవేషన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్" కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఆవిష్కరణల ప్రాముఖ్యత తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఆర్ వైకుంఠరావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. భార్గవి రోజువారీ జీవితంలో ఆవిష్కరణల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ వివి ప్రసన్న కుమార్, విద్యార్థులను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో నైపుణ్యాలను పెంపొందించుకునేలా ప్రేరేపించారు.

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ కమిషనర్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన పి.సంపత్ కుమార్‌ను టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్, 81 డివిజన్ ఇంచార్జ్ మళ్ల సురేంద్ర బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనకాపల్లి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, అనేక చోట్ల వాటర్ ట్యాంకులు మూతపడ్డాయని, అనకాపల్లి విజిట్ చేసి సమస్యల పరిష్కారమయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొండేటి శివ నాయుడు, జొన్నాడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అసోసియేషన్ సభ్యత్వం తీసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ అసోసియేషన్ సభ్యత్వాన్ని తీసుకోవాలని ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్) అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బాబూరావు కోరారు. అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్- రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, ఉద్యోగులు సభ్యత్వాన్ని స్వీకరించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కె.కోటపాడు తాలూకా ఎన్నికలు ఈనెల 29న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణ, సబ్- రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

బస్టాండ్‌లో గంజాయి మూకల వెకిలి చేష్టలు

- భీతిల్లుతున్న విద్యార్థినులు
- 'ప్రజాశక్తి' చొరవతో ఆకతాయిలను కౌన్సెలింగ్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - యలమంచిలి

సాయంత్రం నాలుగు గంటలైతే చాలు యలమంచిలి బస్టాండ్‌లో ఆకతాయిల వెకిలి చేష్టలు మొదలవుతున్నాయి. విద్యార్థుల ముసుగులో గంజాయి మూకలు బస్టాండ్ చేరుకొని మత్తులో వారు చేసే చేష్టలు అమ్మాయిల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బుధవారం సాయంత్రం బస్టాండ్‌లో అల్లరి మూకల విన్యాసాలు ఎక్కువైపోయాయి. బస్టాండ్‌లోని బెంచీలన్నీ ఈ మూకలు ఆక్రమించుకొని ఇష్టాగోష్టిలు ప్రారంభించారు. అమ్మాయిలు కూర్చున్న బెంచీలను టార్గెట్ చేసి వారి ఎదురుగా నలుగురైదుగురు చేరి బూతు జోక్స్‌తో ఇబ్బంది పెడుతున్నారు. వీరి చేష్టలు భరించలేక మరో చోటుకు వెళితే వారు అక్కడకు కూడా చేరి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. కళ్లారా చూసిన ప్రజాశక్తి విలేకరి అక్కడి కంట్రోలర్‌తో మాట్లాడితే.., ప్రశ్నిస్తే తమపైనే దురుసుగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. వీరి ఆగడాలు అరికట్టడానికి స్థానిక టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పాపినాయుడుకు ఫోన్ చేయగా.., పది నిమిషాల్లోనే స్పందించి నలుగురు కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకొని అనుమానితుల్ని పట్టుకొని కౌన్సెలింగ్‌కు పోలీసు స్టేషన్‌కు తరలించారు. బస్టాండ్‌లో ఈవ్ టీజింగ్‌కు స్వస్తి పలకాలంటే ప్రతి రోజు సాయంత్రం 4.30 నుండి 5.30 వరకు పోలీస్ పర్యవేక్షణ అవసరమని స్థానికులు కోరుతున్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎఎంఎఎల్ కాలేజీ సిబ్బంది

ఘనంగా పెదబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణరావు (పెదబాబు) జన్మదిన వేడుకలను బుధవారం స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థిని విద్యార్థుల కరతాల ధ్వనుల మధ్య పెదబాబు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉచిత మెడికల్ క్యాంపులో కేర్ హాస్పిటల్ నుండి జనరల్ ఫిజిషియన్ డాక్టర్ డి.వాణి, నర్సింగ్ స్టాఫ్ కె. సురేష్, ఇ.శిరీషలు పాల్గొని కాలేజి స్టాఫ్‌కు, స్థానికులకు బిపి, షుగర్, ఇసిజి టెస్టులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ బిఎస్. సాగర్, ఐక్యూఏసి కో ఆర్డినేటర్ నిరంజన్ కుమార్, అధ్యాపకులు, సూపరింటెండెంట్ అనురాధ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముద్దాయికి జైలు శిక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి, పరవాడ : గంజాయి కేసులో ముద్దాయికి 4 సంవత్సరాల 5 నెలలు కారాగార శిక్ష, 1000 రూపాయలు జరిమానా విధిస్తూ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి బుధవారం తీర్పునిచ్చారు. అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన నీలకాయల మోహన్ 2020 జనవరి 24న నాలుగు కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో పరవాడ ఎస్సై గోపి లంకెలపాలెం వద్ద పట్టుకున్నారు. అతను బ్యాగులో ఉన్న నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేయగా కేసు దర్యాప్తు అనంతరం బుధవారం తీర్పు చెప్పినట్లు ఎస్పి ఎం దీపిక తెలిపారు. ఈ సందర్భంగా కేసులో సహకరించిన సిబ్బందిని, పిపి వెంకటరావును అభినందించారు

సంప్రదాయ క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - కె.కోటపాడు

సంప్రదాయ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని మండల విద్యాశాఖ అధికారి-2 డివిడి ప్రసాద్ అన్నారు. నూతన విద్యా విధానంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈనెల 22 నుండి 28వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో ఉన్న అన్ని పాఠశాలల్లో సంప్రదాయ ఆటలు ఆడిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే అష్టాచమ్మ, చదరంగం, వైకుంఠపాళి, ఇతర సంప్రదాయ ఆటలు ఆడించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వి.త్రినాధరావు, సత్యం నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : శిక్షా సప్తహ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎమ్ రవీంద్రబాబు ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ఇండోర్ గేమ్స్‌లో భాగంగా పలు రకాల ఆటలు ఆడించారు. ఇందులో పాల్గొన్న మండల విద్యా శాఖాధికారి బి.కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలు అడడం ద్వారా వ్యాధులు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయ ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

రైతు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-వడ్డాది

రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ బుచ్చయ్యపేట మండలం లోపూడి సచివాలయం వద్ద ఏపి వ్యవసాయ కార్మిక సంఘం, ఏపి రైతు సంఘం ఆధ్వర్యాన బుధవారం ధర్నా చేసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పినపాత్రుని సాంబశివరావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు వెంటనే రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి అన్ని పథకాలు అమలు చేయాలని కోరారు. రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయాలని, కేరళ తరహాలో రైతులకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాతబాబు, శ్రీను, అప్పారావు రైతులు దుర్గప్రసాద్, బావిశెట్టి పెదసూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేసి వినతిపత్రం ఇస్తున్న రైతులు, వ్యకాస నాయకులు

ఘనంగా అయ్యంకి జయంతి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యంకి చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళు లర్పించారు. ఈ సంధర్భంగా గ్రంధాలయ అధికారి జనార్దన్ మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి ఎనలేని కృషి చేశారన్నారు.కోస్తాంధ్రలో అనేక గ్రంథాలయాలను ఆయన స్థాపించారన్నారు. ఆయన పోరాటాలతోనే గ్రంథాలయాలు స్థాపించబ డ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అప్పలరాజు, పాలూరి బుల్లి వెంకటరావు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్వాతంత్ర్య ఉద్యమానికి తోడ్పాటు నందించిన గొప్ప వ్యక్తి గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కె.త్రిమూర్తులురెడ్డి కొనియాడారు. బుధవారం నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో వెంకటరమణయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులరెడ్డి మాట్లాడుతూ,చదువు అభివృద్ధికి మూలం అని గ్రహించి అందరూ చదువుకోవాలని అందుకు గ్రంథాలయాలు అవసరమని భావించి దేశమంతా గ్రంథాలయాలు ఏర్పాటుకు చేశారన్నారు. గ్రంథాలయాలను కేంద్రాలుగా చేసుకుని స్వతంత్ర్య పోరాట యోధులను తయారు చేశారన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలలో గ్రంథాలయ మహాసభలు నిర్వహించారన్నారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పి.ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి పి.దమయంతి పాల్గొన్నారు.

సింహాచలం : అడివివరం శాఖా గ్రంధాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ 134వ జయంతిని పురస్కరించుకుని గ్రంథాలయాధికారి ఎన్ వి నరసింహం ఆధ్వర్యాన అయ్యంకి చిత్రపటానికి విశ్రాంత హెచ్ఎం బండారు గంగునాయుడు, దేవస్థానం విశ్రాంత పర్యవేక్షకులు వి.కామేశ్వరరావు పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలనతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎవిఎస్ భానుమూర్తి, చిన్నప్పన్న పాల్గొన్నారు.

కశింకోట :గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలు మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంధాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.జగన్నాథం అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అయ్యంకి వెంకట రమణయ్య జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ నిర్యహించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో నివాళులర్పిస్తున్న కృష్ణారావు, విద్యార్థులు

బుచ్చయ్యపేట : అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి బుచ్చయ్యపేట శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు వి.కృష్ణారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుడుగా, పాత్రికేయునిగా, గ్రంథాలయాల ఏర్పాటుకు అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి చిత్రపటానికి గ్రంథాలయ అధికారి వి శిరీష కుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు సింహాద్రప్పడు పాల్గొన్నారు.

బ్లీచింగ్ చేయిస్తున్న సర్పంచ్

మంచాలలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చీడికాడ:వర్షాల నేపథ్యంలో దోమల నివారణకు గ్రామంలో పారిశుధ్య పనులతో పాటు అన్ని వీధుల్లో బ్లీచింగ్ జల్లించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ కసిరెడ్డి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని మంచాల గ్రామంలో కాలువల్లో పూడికలను తీయించి పారిశుధ్య పనులను చేశారు. మురుగునీరు నిలవ లేకుండా పరిశుభ్రత పనులు చేపట్టారు. గ్రామంలో ప్రజలకు ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ కసిరెడ్డి భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, సచివాలయ కార్యదర్శి వనిత పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల:సత్య సాయి వికాస్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత పాఠశాలల విద్యార్థులకు బుధవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పాములవాక గ్రామంలో లాంచనంగా ప్రారంభించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. సంస్థ సభ్యులు, టిడిపి నాయకులు విశ్వనాథం, వేచలపు భాస్కరరావు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుస్తకాలు ఇస్తున్న నిర్వాహకులు, నాయకులు

రూ.50వేల చెక్కు అందజేత

ప్రజాశక్తి గొలుగొండ: ప్రమాదంలో గాయపడ్డ జనసేన కార్యకర్తకు రూ.50వేల భీమా చెక్కును బుధవారం జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర అందజేశారు. మండలంలో చీడిగుమ్మల గ్రామానికి చెందిన షేక్ రహమతుల్ల ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఆ చెక్కును బాధితునికి అందజేశారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, జనసేన కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండెం దొరబాబు, రేగుబళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గొలుగొండ : విద్యార్థుల ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని చోద్యం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రత్నాజీ తెలిపారు. మండలంలో చోద్యం హైస్కూల్లో బుధవారం 'శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు "స్పోర్ట్సు డే" ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, శరీర దారుఢ్యం పెంపొందించుకోవ డానికీ, ఆరోగ్యంగా ఉండడానికి ఆటలు ఆడడం చాలా అవసరమన్నారు. విద్యార్థులతో కర్రబిళ్ళ, ఒంగుడు దూకుడు, అష్టాచమ్మా, తొక్కుడు బిళ్ళ, చెస్, గోళీలాటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో పిఈటి కుందూరు నూకరాజు, రమణ, వరప్రసాద్, వాసు పాల్గొన్నారు.

చెస్ ఆడుతున్న విద్యార్థులు

కొలతలు తీస్తున్న ఉద్యోగులు

రోడ్డు నిర్మాణానికి కొలతలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి రాజీవ్ నగర్ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టేందుకుగాను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు నరేంద్ర, వెంకటేష్‌లు బుధవారం కొలతలు తీసుకున్నారు. కాలనీలో రోడ్డు, డ్రైనేజీ లేకపోవడంతో కలుగు ఇబ్బందులను కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కాలనీలో పర్యటించి వీటి నిర్మాణాలకు గాను నిధులు మంజూరుకు కొలతలు తీసుకుని ఎస్టిమేషన్ వేశారు.రోడ్డు నిర్మాణానికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు, కోసూరి నానిబాబు, సకురు స్వామి, నడిగట్ల అప్పన్న, కర్రి నాదు, కర్రి రవి పాల్గొన్నారు.

ఎంపిడిఒకు ఘన నివాళి

ప్రజాశక్తి-నాతవరం:పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకట రమణారావుకు బుధవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె రాంబాబు, ఈవోపీఆర్‌డి ఎన్‌వివి మూర్తి, ఏవో పి.పార్థసారథి, ఏపిఎం ఎం.లక్ష్మి, ఏపిఓ పి.చిన్నారావు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-గొలుగొండ : సిసిఆర్సి కార్డులతో కౌలు రైతులకు పంటపై హక్కులు ఉంటాయని డిప్యూటీ తహసీల్దార్ భరత్, మండల వ్యవసాయాధికారిణి సుధారాణి తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, పంటకు రుణాలు వంటివి కౌలు రైతులకు వర్తిస్తాయన్నారు. ప్రస్తుతం సిసిఆర్సీ కార్డులు వీఆర్వో లాగిన్లో పొందడానికి అవకాశం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, విఏఏలు, విహెచ్ఏలు, ఏఈవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

జాబ్ కార్డులు అందజేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ జాబ్ కార్డులు అందజేయాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి, గృహ నిర్మాణం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం నుండి అందాల్సిన 90 పని దినాల నిధులను తక్షణమే అందజేయాలని, జాబ్ కార్డులు అందజేయాలని సూచించారు. హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగు నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ దీక్షలు విడ్డూరం :టిడిపి

ప్రజాశక్తి -కోటవురట్ల:మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో చేపడుతున్న నిరసన దీక్షపై టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు హెద్దేవా చేశారు, ఆయన చేపట్టిన దీక్షతో దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని బుధవారం కోటవురట్లలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన చేసిన అకృత్యాలు ప్రజలు నేటికీ మర్చిపోలేదని, బాబాయి గొడ్డలి పోటు సహా ఎమ్మెల్సీ డ్రైవర్ హత్య ఉదాంతం, డాక్టర్ సుధాకర్ను చిత్రహింసలు చేసి కడ తీర్చడంతో పాటు ప్రతిపక్ష నాయకులను వేధింపులు మర్చి పోయి ఢిల్లీలో ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.దేశ, రాష్ట్ర ప్రజలు అంత గమనిస్తున్నారని ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోవాలని సూచించారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పలు గిరిజన గ్రామాల్లో బుధవారం గొలుగొండ పిహెచ్సి వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎన్ కంటారం పంచాయతీ సుద్దలపాలెం, అడ్డలోవ, సాలిక మల్లవరం పంచాయతీ శివారు వెంకటాపురంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డెంగ్యూ, మలేరియా , డయేరియా వ్యాధులపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. స్థానిక జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు ఎన్.కంటారం పంచాయతీలో వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ నాయుడు, సిహెచ్ఓ సాయి మణి, హెల్త్ అసిస్టెంట్లు ఈశ్వరరావు, జయ కృష్ణ లు , ఏఎన్ఎం విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-నక్కపల్లి:నక్కపల్లి గణపతి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి పురస్కరించుకొని అర్చకులు శేషాచార్యులు, అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుంటా కమిటీ సభ్యులు పలు ఏర్పాట్లు చేశారు.

వినూత్న ఆలోచనలతో ప్రపంచ సవాళ్లకు పరిష్కారం

-గీతం గ్రాడ్యుయేషన్ డేలో ఎక్స్వెరన్ పూర్వ ఎండీ శిల్పా గుప్తా- వివిధ విభాగాల్లో 3168 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు

ప్రజాశక్తి -మధురవాడ: వినూత్న ఆలోచనలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రపంచం ఎదుర్కొంటున్న పలు సవాళ్లకు పరిష్కారం చూపాలని ఎక్స్వెరస్ గ్రూప్ మాజీ మేనేజింగ్ డైరక్టర్ శిల్పా గుప్తా విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రుల దినోత్సవాన్ని (గ్రాడ్యుయేషన్‌డే) ఘనంగా నిర్వహించారు. గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్ అధ్యక్షతన 3168మంది విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. గీతంవిశాఖ ప్రాంగణం నుంచి 2023-24 విద్యా సంవత్సరానికి 2818 మంది పట్టభద్రులకు డిగ్రీలను, 99 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌లు (పిహెచ్‌డి), అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 44 మందికి బంగారు పతకాలను అందజేశారు.

ఈ సందర్భంగా గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ వివిధ కోర్సులలో గీతంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రూ.35.23 కోట్ల స్కాలర్‌షిప్‌లను, 55 మంది పరిశోధకులకు మూర్తి రీసెర్చిఫెలోషిప్‌లను అందించామన్నారు.దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి 63 పరిశోధన ప్రాజెక్టులను నిర్వహిస్తున్నామన్నారు. గీతంలో జరుగుతున్న అధ్యయనాలను గుర్తించిన భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం రూ 13.43కోట్లతో ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చి అండ్ సైంటిఫిక్ ఎక్సలెన్స్ (పర్స్) ప్రోగ్రామ్ మంజూరు చేసిందని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషిన్ లెర్నింగ్ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ఇన్‌క్లూజివ్ టెక్నాలజి బిజినెస్ ఇంక్యూబేటర్ (ఐటిబిఐ) కేంద్రాన్ని గీతంలో నెలకొల్పడానికి డిఎస్‌టి ముందుకొచ్చిందన్నారు. భారత ప్రభుత్వ టెలీ కమ్యూనికేషన్ విభాగం (బిఎస్‌ఎన్‌ఎల్) గీతంలో 5జి టెక్నాలజి అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పిందన్నారు. ఈ సందర్భంగా గీతం పరిశోధకులు, విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. విశ్వవిద్యాలయం గీతం వర్సిటీ అధ్యాపకులు గతేడాది రెండు వేలు పరిశోధన పత్రాలను వెలువరించారని, 12 కన్సల్టెన్సీ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ఎమ్. గంగాధరరావు, కార్యదర్శి ఎమ్.భరద్వాజ, జీమ్‌సర్ ప్రో వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి, విశ్వవిద్యాలయ అకడమిక్ డీన్‌లు, డైరక్టర్లు సంప్రదాయ అకడమిక్ ప్రొసెషన్‌లో పాల్గొన్నారు.

స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు

మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -కొత్తకోట: జోష్ మిషన్ ఆర్‌సిఎం క్లినిక్ ద్వారా నిరు పేదలకు వైద్య ఆరోగ్య సేవలు ఉచితంగా అందించడం అభినందనీయమని కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ రావు కొనియాడారు. రావికమతం మండలం ధర్మవరం గ్రామ సమీపంలో ఫాదర్ కె.వర్గీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోష్ మిషన్ ఆర్‌సిఎం క్లినిక్ (ఆసుపత్రి)3 వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో పేదలకు ఉచితం గా వైద్య సేవలు అందించడం కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రి దిన, దినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి పౌండర్ ఫాదర్ వెర్గీష్ మాట్లాడుతూ, గత కరోనా కాలం లో ప్రజలు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టు కొని ఆసుపత్రి నిర్మాణం చేపట్టామన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచితం గా వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. తొందరలో నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలఫ్ కోర్సు లో భాగం గా కంప్యూ టర్ ఉచిత శిక్షణ కు ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చోడవరం టిడిపి మహిళా విభాగం అధ్యక్షురాలు కోట నీలవేణి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, మాజీ సర్పంచ్ గాలి రమణబాబు, మాజీ ఎంపిటిసి బంటు శ్రీను, టిడిపి నాయకులు గాలి రమణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాలలో ప్రధానంగా పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని జిల్లా పంచాయతీ అధికారిని శిరీషరాణి సూచించారు. స్థానిక పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ కార్యదర్శులకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం పట్ల దృష్టి సారించడంతో పాటు తాగునీటి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలతో పాటు గ్రామాలలో దోమల మందులు పిచికారి చేయించాలని, ఫాగింగ్ యంత్రాలు వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ స్వామి నాయుడు, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

హాజరైన ఉద్యోగులు

శ్మశానవాటిక బోరుకు మరమ్మతులు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఎ.యల్.పురం మేజర్ పంచాయతీ శ్మశాన వాటికలో గత కొంత కాలంగా మరమ్మతులకు గురైన చేతి బోరును గ్రామ సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాగు చేయించారు. శ్మశానంలో అన్నీ సమస్యలే పేరుతో ప్రజాశక్తిలో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నీటి అవసరాలకు ఇబ్బంది గమనించి చేతి బోరును బాగు చేయించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి కె.రాజేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కుళాయిల్లో మురుగునీరుపై చర్యలు చేపట్టాలి

సిపిఎం కార్పొరేటర్ గంగారావు

పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగారావు తదితరులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 31, 38వ వార్డులలో కుళాయిల ద్వారా గత కొంతకాలంగా మురుగునీరు వస్తోందని, దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని 78వ సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. 31, 38 వార్డులలో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోందని స్థానికులు ఇటీవల ఆందోళన చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అతిసార, డెంగీ వంటి విష జ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో స్మార్ట్ సిటీగా పేరొందిన విశాఖపట్నంలో ఇటువంటి పరిస్థితి చాలా శోచనీయమన్నారు. జివిఎంసి అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పన్నులు వేయడంలో పోటీపడే ప్రభుత్వాలు ప్రజలకు తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయని విమర్శించారు. సమస్య పరిష్కారమయ్యేలా జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సిపిఎం జగదాంబ జోన్ నాయకులు ఎం. సుబ్బారావు, శేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు మరింత అన్యాయం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి అజ శర్మ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ఆర్థికమంత్రి నిన్న తన బడ్జెట్ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించినా నిధులు కేటాయింపు నిరాశే కలిగించిందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పేర్కొన్నారు. మాటల్లో కూడా స్పష్టత లేకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజల్ని మోసగించడానికి కేంద్రం ప్రయత్నించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ విరమిస్తున్నట్టు హామీ ఏదీ ప్రకటించలేదని, దీనికి తోడు ప్రభుత్వ సంస్థల వాటాల అమ్మకం ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారని వివరించారు. ఎన్నాళ్ల నుండో ఊరిస్తున్న రైల్వే జోన్, మెట్రో రైల్, విద్యా సంస్థల నిర్మాణం, గిరిజన, పెట్రో యూనివర్సిటీ అంశాల మాటే లేదని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ ఎంత ఇస్తారో చెప్పనే లేదని, ఆంధ్రప్రదేశ్‌పై మాటలు ఘనం - నిధులు స్వల్పం అన్నచందంగా ఉందని విమర్శించారు. రాజధాని అమరావతికి 15 వేల కోట్ల రూపాయలు ప్రపంచబ్యాంకు ద్వారా అప్పులు ఇప్పిస్తామని మంత్రి పేర్కొనటం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదని పేర్కొన్నారు. షరతులలోనికి, మరింత అప్పుల ఆర్థిక సంక్షోభంలోకి రాష్ట్రం నెట్టబడుతుందని వివరించారు. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలుకు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని, బడ్జెట్ మాటల గారడీ ఉచ్చులో పడిపోకుండా స్పష్టమైన నిధులు సాధించాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యాలలో రాణించాలి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విద్యార్థులు చదువుతోపాటు స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, మంచి మాటతీరు, నడవడికతో బంగారు భవిష్యత్తు ఏర్పాటుచేసుకోవాలని సాహితీ సభ్యులు, కవి, రచయిత బొడ్డ కూర్మారావు సూచించారు. కంచరపాలెంలోని గవర్నమెంట్ గర్ల్స్ ఐటిఐలో సాహితీ స్రవంతి, లయన్స్ క్లబ్ ద్వారక నగర్ నిర్వహించిన 'చదువులో నైపుణ్యాలు అంతం' పై బుధవారం మాటల పోటీ నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ జివి.రమణ , లయన్స్ క్లబ్ ద్వారకా నగర్ అధ్యక్షులు పిజి.లక్ష్మీనారాయణ, సత్య ప్రసాద్ తేజ, ఐటిఐ ట్రైనింగ్ ఆఫీసర్ కె.శంకరరావు, బి.శ్రీనివాసరావు, కె.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక విభాగంపై సమీక్ష

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : వివిఎంఆర్‌డిఎలోని సాంకేతిక విభాగం పనితీరుపై కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, బుధవారం సమీక్ష నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను చేపట్టాలని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు. తదుపరి ఉద్యోగభవన్‌లోని అన్ని అంతస్తులు తిరిగి భవన స్థితిగతులను అడిగితెలుసుకున్నారు.

మార్చి నాటికి 10వేల మందికి ఉపాధి

-జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో వచ్చే ఏడాది మార్చి నాటికి 10 వేల మందికి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించే దిశగా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సాయికృష్ణను ఆదేశించారు. 10 వేల ఉద్యోగాలలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ (ఆర్సేటిఐ) ప్రోగ్రాం ద్వారా ఎంత మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించ గలరో ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం ఆయన ఛాంబరులో జిల్లా స్థాయి నైపుణ్యాభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జాబ్ మేళా నిర్వహించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్టు తెలిపారు. వీటితో పాటు వచ్చే నెల 15వ తేదీ తరువాత ప్రతి నెలా జాబ్ కేలండర్‌ను విడుదల చేసేలా ప్రణాళికలు రచించాలన్నారు. జాబ్ కేలండర్‌లో తేదీ, సమయం, సంస్థలోని ఉద్యోగాల ఖాళీలు, అర్హతలు తదితర వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. జాబ్ కేలండర్‌లో విడుదల చేసిన పోస్టులన్నీ భర్తీ అయ్యేలా ముందుగానే అభ్యర్థుల దరఖాస్తులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వివిధ రంగాల్లో ఖాళీ పోస్టుల గురించి ఆయా యాజమాన్యాలతో మాట్లాడి వారికి అవసరమైన సిబ్బంది, విద్యార్హతలు, పోస్టులు తదితర వివరాలు సేకరించి, అందుకు తగిన విధంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జివిఎంసి 4వ జోన్‌లో 30న వేలంపాట

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: జివిఎంసి 4వ జోన్ పరిధిలో డెక్కన్‌ట్యాంక్, జగదాంబ, పాత బస్ స్టాండ్ ఫేజ్-2, పద్మనగర్, సూర్యాబాగ్‌లోని వాణిజ్య సముదాయాలలో పలు దుకాణాలకు, అంబేద్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతు బజార్, రెల్లివీధి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్లు, ఎన్‌విపి (పూర్ణ) మార్కెట్ ఆశీల కోసం ఈ నెల 30న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ పివివిడి.ప్రసాదరావు బుధవారం తెలిపారు. మూడేళ్ల కాలపరిమితికి గుత్తకిచ్చుటకు ఈ నెల 30న ఉదయం 11 గంటలకు సూర్యాబాగ్‌లోని 4వ జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంపాటలో నిబంధనలకు లోబడి పాల్గొనాలని కోరారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యాన మద్దిలపాలెం ఆర్‌టిసి డిపోలో బుధవారం హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భద్రత, కుటుంబం భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులు హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరిగా పాటించాలని డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎవి.శేషమ్మ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ వల్లభనాయుడు, ఆర్‌టిసి డిప్యూటీ సిటిఎం జి.సత్యనారాయణ, మద్దిలపాలెం డిపో మేనేజర్ ఎన్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.